ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశ్వ సదస్సుల వేదికగా విశాఖ

- 14, 15 తేదీల్లో సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌ల హంగామా!
- యుఎఇలో పారిశ్రామిక వేత్తల భేటీకి సిఎం చంద్రబాబు
- గత 3 దఫాల సదస్సులపై 'శేతపత్రం' ఎక్కడ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అంతర్జాతీయంగా విశాఖ నగరం పేరు తాజాగా మార్మోగిపోతున్న విషయం తెలిసిందే. గూగుల్ కంపెనీ సుమారు రూ.లక్షన్నరకోట్లతో విశాఖలో పెట్టుబడులు పెట్టి డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతుందన్న ప్రచారం ఒక పక్క, మరోపక్క సిఐఐ భాగస్వామ్య సదస్సుల సన్నాహాల్లో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం మునిగితేలుతున్నారు. విశాఖ రూపు రేఖలు మరో ఐదేళ్లలో మారబోతున్నాయన్న ప్రచారంతో రాష్ట్రంలోని 'కూటమి' ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రజలంతా తమ ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు తోడ్పడాలన్న రాజకీయ నినాదాన్ని 'కూటమి' ప్రభుత్వం ప్రచారంలో పెట్టేందుకు తాజాగా సిద్ధమైంది. అయితే గతంలో 3 పర్యాయాలు నిర్వహించిన సిఐఐ సదస్సుల్లో రూ.లక్షల కోట్లు ఒప్పందాలు జరిగినట్లు ప్రచారం తెలిసిందే. వాటిలో ఎన్ని కంపెనీలు రాష్ట్రానికి, విశాఖకు వచ్చాయి. వాటి ఫలితాలేమిటి? విశాఖలో నిర్వహించినందుకు ఏం సాధించాం? ఇంకా మిగిలి ఉన్న లక్ష్యాలేమిటన్న విషయాలపై ప్రభుత్వం నుంచి 'శ్వేతపత్రం' కోసం విశాఖ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. మధ్యతరగతి ప్రజానీకానికి, అత్యధికమంది అసంఘటిత రంగ కార్మికులకు కేంద్రమైన విశాఖలో మధ్యతరగతి ఆలోచనలను ప్రభావితం చేసే దిశగా చంద్రబాబు సర్కారు అనునిత్యం ఏదో ఒక ప్రచారాన్ని తలకు ఎత్తుకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా గూగుల్, సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌ల హంగామా విశాఖలో నడుస్తోంది. రహదారుల రిపేర్లు మొదులుకొని భీమిలి నుంచి ఆర్‌కె.బీచ్ వరకూ ఒకే ఏరియాలో కేంద్రీకరించి సుందరీకరణ పనులకు జిల్లా అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. మిగతా నగరాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకెళ్తుందన్న విమర్శలు నగర జనం నుంచి వినిపిస్తున్నాయి.

అంతర్జాతీయ సదస్సుల వేదికగా విశాఖ...

విశాఖ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుల నిర్వహణకు రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం 4వ దఫాకు సిద్ధమవుతోంది. 2014 నుంచి 2019 మధ్యకాలంలో 3 పర్యాయాలు ఈ సమ్మిట్‌లను చంద్రబాబు ముఖ్యమంత్రిగా నిర్వహించిన సంగతి తెలిసిందే. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) మరో భాగస్వామ్య సదస్సులకు వేదికగా మారనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యుఎఇ)కి బుధవారం ప్రయాణం అయ్యారు. అక్కడ 3 రోజుల పాటు వివిధ రకాల పారిశ్రామిక ప్రతినిధులతో భేటీ కానున్నారు. ఇదివరకే సింగపూర్ కూడా వెళ్లి వచ్చారు. దుబాయ్‌లో ఒక రోడ్‌షోను కూడా మిగతా 2లో..

ప్రజారోగ్య సంరక్షణకు..

ఫుడ్ సేఫ్టీ విభాగం బలోపేతం

శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామకృష్ణరాజు

అధికారులతో సమీక్షిస్తున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రజారోగ్య సంరక్షణకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయడానికి శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ కృషి చేస్తోందని ఆ కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. విశాఖపట్టణం జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారులతో చర్చించిన అంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయడంపై సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలను శాసనసభ స్పీకర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు, ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) ప్రమాణాలను పెంచేందుకు ఉద్దేశించిన రెండు కీలక అంశాలపై పిటిషన్స్ కమిటీ అధికారులతో సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు. ఫుడ్ సేఫ్టీని బలోపేతం చేసి రాష్ట్ర ర్యాంకు మెరుగు కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, రాష్ట్ర స్థాయిలో 500 మంది ఉద్యోగులు అవసరమైతే, ప్రస్తుతం కేవలం 25 శాతం సిబ్బంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత నాలుగు ల్యాబరేటరీలు ఇంకా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని, వాటిని యుద్ధ ప్రాతిపదికన ఆపరేషన్‌లోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. మంచినీరు, పాల ఉత్పత్తుల కల్తీని పరీక్షించేందుకు ల్యాబ్ సదుపాయాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్‌లో ప్రస్తుతం దేశంలో 29వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని వచ్చే ఏడాది కనీసం 15వ స్థానానికి, ఆపై టాప్ 5లోకి తీసుకురావాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. తక్షణ చర్యల్లో భాగంగా మిగతా 2లో..

ప్రయాణికుల రద్దీ నివారణకు ప్రత్యేక చర్యలు
▶ వార్త 2లో..

ప్రజాభీష్టం మేరకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
▶ వార్త 8లో..

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు
▶ వార్త 8లో..

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాల్సిందే..
▶ వార్త మెయిన్‌లో..

జివిఎంసి స్థాయీ సంఘంలో అభివృద్ధి పనులకు ఆమోదం

జివిఎంసి స్థాయీ సంఘం సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థాయీ సంఘం సమావేశంలో 205 ప్రధాన అంశాలు, 12 టేబుల్ అజెండాలతో 217 అంశాలు పొందుపరచగా, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించి 213 అంశాలకు ఆమోదం తెలిపారని వివరించారు. ప్రధాన అజెండాలోని 2, టేబుల్ అజెండాలోని 2 అంశాలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.46.81 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ప్రజా ఆరోగ్యం విభాగం పారిశుధ్య కార్మికులు, సిబ్బంది జీతభత్యాలతో పాటు జివిఎంసి ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన అంశాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించిన అద్దెలు తదితర అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. గాజువాక ప్రాంతానికి చెందిన స్నేక్ క్యాచర్ కిరణ్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నందున అతనిని విధుల నుండి తొలగించాలని స్థాయీ సంఘం సభ్యులు అధికారులకు సూచించారు. పారిశుధ్య కార్మికులకు, ఇతర సిబ్బంది జీతాలు నిర్ణీత సమయానికి సమర్పించాలని అధికారులకు చైర్మన్ సూచించారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవలు పునరుద్ధరించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు లేఖ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ఎన్‌టిఆర్ వైద్యసేవను తక్షణమే పునరుద్ధరించి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆయన లేఖ రాశారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలను నిలిపివేయడంతో విశాఖ జిల్లాలోని సుమారు 65 ఆసుపత్రులలో వైద్యసేవలు అందడం లేదని వివరించారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పేదరోగుల ప్రాణాలు ప్రమాదంలోపడ్డాయని, ఆయా కుటుంబాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయని పేర్కొన్నారు. రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు షిఫ్ట్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా పెరిగిన రోగులకు తగ్గట్లు డాక్టర్లు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేక సరైన వైద్యం అందడంలేదని వివరించారు. గత 13 రోజులుగా వేలాదిమంది రోగులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎన్‌టిఆర్ ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడం సరికాదని విమర్శించారు.

కార్పొరేట్లకు, బడా పారిశ్రామిక వేత్తలకు, సంపన్నులకు రూ.వేలకోట్లు రాయితీలు, సదుపాయాలను చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలపై ప్రకటిస్తుందని, వేలాదిమంది ప్రజల ప్రాణాలను కాపాడడానికి వైద్యం కోసం అవసరమైన నిధులను విడుదల చేయకపోవడం ప్రజల జీవించేహక్కుకు త్రిలోధకం ఇవ్వడమే అవుతుందని పేర్కొన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమని తెలిపారు. సామాన్యులకు సైతం కార్పొరేట్ ఆసుపత్రులలో ఘనమైన వైద్యాన్ని అందిస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వం ఈ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వైద్య సేవలు నిలిచిపోయే స్థితికి నెట్టడం శోచనీయం అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే కలుగజేసుకొని ఎన్‌టిఆర్ వైద్యసేవల నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపి, బకాయిలకు అవసరమైన నిధులు విడుదల చేసి వైద్య సేవలు పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి..

విశ్వ సదస్సుల వేదికగా విశాఖ

ఈ సందర్భంగా బాబు నిర్వహించనున్నారు. అనేక కంపెనీలను విశాఖలో నవంబర్‌లో జరిగే సిఐఐ భాగస్వామ్య సదస్సుకు బాబు ఆహ్వానించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. గూగుల్ విశాఖ వచ్చే అంశంపై అనేక అనుమానాలను రాష్ట్ర ప్రజలు, విశాఖ ప్రాంత వాసులు వెలిబుచ్చుతున్నారు. వందల ఎకరాల భూమిని గూగుల్ కు దారాదత్తం చేస్తున్నారన్న విమర్శలు అన్ని పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. అంతేగాక రూ.22వేల కోట్లు గూగుల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎదురు రాయితీలిచ్చి తెచ్చుకోవాల్సిన ఆగత్యం ఏమిటన్న ప్రశ్న సిపిఎం సహా పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు. సిఐఐ వేదికల్లో గూగుల్‌పై ప్రత్యేక డాక్యుమెంటరీని చంద్రబాబు ప్రభుత్వం ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజారోగ్య సంరక్షణకు ఫుడ్ సేఫ్టీ విభాగం బలోపేతం

గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న అర్హత కలిగిన వారిని ఈ విభాగంలోకి తీసుకోవడం, ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడంపై సమావేశంలో చర్చించామన్నారు. వారం పది రోజుల్లో అధికారులు సమర్పించే డీటెయిల్డ్ ప్రపోజల్‌ను స్పీకర్‌కు ఇచ్చి, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

హీమోఫీలియా సమస్యతో బాధపడుతున్న కొద్దిమందికి చికిత్స అందించడంలో ఇబ్బందులు గుర్తించామని, ఈ చికిత్సను డేకేర్లోకి తీసుకురావడం, కెజిహెచ్‌లో వసతులను మెరుగుపరచడంపై చర్చ జరిగిందని తెలిపారు. నవంబర్ మొదటి వారంలో విశాఖపట్నంలో మొట్టమొదటి రీజనల్ ఫుడ్ ల్యాబరేటరీ ప్రారంభం కానుందని తెలిపారు. అనంతరం సభ్యులతో కలిసి ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు.

25న 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సుప్రసిద్ధ రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచి, 14 భారతీయ భాషల్లోకి అనువదించిబడిన 'మట్టిమనిషి' నవల ఆధారంగా రూపొందించిన నాటకాన్ని ఈనెల 25వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్లు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మట్టి మనిషి నవల ఆధారంగా అరసం ప్రధాన కార్యదర్శి, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ నాటకంగా మలచగా, ఎస్ఎం.బాషా దర్శకత్వంలో హైదరాబాద్, గుంటూరు, తెనాలి, విజయవాడ, ఏలూరు పట్టణాలలో 50 మంది నటీనటులు, సాంకేతిక నిపుణులతో విజయవంతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలను పొందిందని వివరించారు. మట్టికీ మనిషికీ సామాజికంగా ఉండే సంబంధాలు, ఆ సంబంధాలలోని మార్పులను వాస్తవంగా చిత్రించిన నవలకు దృశ్యరూపకం మట్టిమనిషి అన్నారు. భూమిని వ్యాపార దృష్టితో అమ్ముకొనే జీవితాలలోని దుష్ఫలితాలకు అద్దం పట్టే ఈ నవల మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ కాలమ్లో ప్రస్తావించిన – నన్నయ్య నుంచి నేటివరకు వెయ్యి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో 'మట్టిమనిషి' పదమూడో రచనగా పేర్కొనబడిందని తెలిపారు. 3 గంటల ప్రదర్శనగా రూపొందించిన ఈ నాటకాన్ని అభ్యుదయ రచయితల సంఘం, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. నాటకాభిమానులు ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9849317608, 9440878247 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎబిఎన్ రిపోర్టర్ రామకృష్ణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎబిఎన్ ఆంధ్రజ్యోతి గాజువాక రిపోర్టర్ రామకృష్ణ అకాల మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాస్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రామకృష్ణ మృతి పట్ల ఎపిబిజెఎ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, మదన్, ఎపి స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, శ్రీనివాస్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : జీతాలు తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మద్దిలపాలెం ఆర్‌టిసి డిపో వద్ద బుధవారం అద్దె బస్సు డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ, అగ్రిమెంట్ కాలం పూర్తయి సంవత్సరం అవుతున్నా జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చే వరకు పోరాడతామని స్పష్టంచేశారు. జీతంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ, నైట్ హాల్ట్ అలవెన్స్, ఇన్స్యూరెన్స్, జిల్లా బస్సు పాస్ ఇవ్వాలని, సంవత్సరానికి ఒక నెల జీతం బోనస్ గాను, రెండు జతల యూనిఫాం, నాలుగు వారాంతపు సెలవులు, అన్ని కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల నుండి వాల్తేరు డిపోలో సమ్మె జరుగుతున్నా ఇప్పటివరకు అద్దె బస్సు యజమానులు చర్చలకు రాలేదని, తక్షణం చర్చలు జరిపి సమ్మె డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఆన్ కాల్ డ్రైవర్లకు 8 గంటల పనికి రూ.1000 చెల్లిస్తున్నారని, అదే డ్యూటీ చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు 8 గంటల పనికి రూ.600 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఆర్‌టిసి అధికారులు యజమానులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని కోరారు. లేకుంటే వాల్తేర్, మద్దిలపాలెం, సింహాచలం డిపోలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్దిలపాలెం, వాల్తేరు డిపో అద్దె బస్సు డ్రైవర్లు, సిఐటియు నాయకులు కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎపిఎస్ఆర్‌టిసి వాల్తేరు డిపోలో పనిచేసే హైర్‌బస్ డ్రైవర్లు సమ్మె విరమించారు. గత 5రోజులుగా చేస్తున్న సమ్మెతో ఆర్‌టిసి ఈడీ జోక్యంతో హైర్‌బస్ యజమానులు యూనియన్ నాయకులతో చర్చలు జరిపి సమ్మె డిమాండ్లను నెరవేర్చేందుకు అంగీకరించడంపై హైర్‌బస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) హర్షం వ్యక్తం చేసింది. వీరికి సంఘీభావం తెలుపుతూ సమ్మె నోటీసు ఇచ్చిన మద్దిలపాలెం, సింహాచలం డిపోల అద్దె బస్సు డ్రైవర్లకు కూడా వర్తించే విధంగా యాజమాన్యాలు అంగీకరించడంపై సిఐటియు ధన్యవాదాలు తెలిపింది. గత అగ్రిమెంట్‌లో రూ.18 వేలు జీతం ఉంటే ప్రస్తుతం రూ.3500 పెంచి రూ.21,500 ఇవ్వాలని, పెరిగిన జీతం 2025 అక్టోబర్ నుండి అమలు చేయాలని, ఏటా రూ.5000 బోనస్, రెండు జతల యూనిఫాం ప్రతి సంక్రాంతికి ఇవ్వాలని, వాల్తేరు డిపోలో 5 రోజుల సమ్మె కాలం జీతం చెల్లిస్తామని, నైట్ హాల్ట్ అలవెన్స్ రూ.100 ఇవ్వాలని, బస్సు యాక్సిడెంట్ సమయంలో పోలీస్ స్టేషన్, కోర్టు ఖర్చులు అద్దె బస్సు యజమానులు భరించాలని అంగీకరించారు. సమస్య పరిష్కారం కోసం ఆర్‌టిసి ఈడీ జోక్యం చేసుకోవడంపై అతనికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ చర్చలలో యజమానుల తరపున పార్వతీశం, గౌతమ్, కృష్ణారెడ్డి, తిరుపతిరావు, ఉదయ్ తదితరులు, యూనియన్ నుండి సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెజెఎ.అప్పారావు (శివ), అర్జున్, హైర్‌బస్ డ్రైవర్స్ యూనియన్, అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల నుండి సిహెచ్.కృష్ణ, వాల్తేర్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి.రఘు, బి.జంపన్న, మద్దిలపాలెం నాయకులు తేజ, కృష్ణ, సింహాచలం డిపో నుండి సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ నివారణకు వాల్తేర్ డివిజన్ ప్రత్యేక చర్యలు

డిఆర్ఎం లలిత్ బొహ్రా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండుగల సీజన్ దృష్ట్యా రైల్వే ప్రయాణికుల రద్దీని సులభతరం చేయడానికి, వారి ప్రయాణాన్ని సౌకర్యవంతం చేయడానికి పలు చర్యలు చేపట్టినట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డిఆర్ఎం లలిత్ బొహ్రా తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ప్రయాణికుల కోసం వాల్తేరు రైల్వే డివిజన్ 209 ప్రత్యేక రైళ్లను నడుపుతోందని, ఇందులో 67 రైళ్లు ఈ డివిజన్ నుంచే బయలుదేరుతుండగా, మిగిలినవి ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నాయని వివరించారు. ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి 600కు పైగా ప్రత్యేక లేదా అదనపు కోచ్‌లను రైళ్లకు జత చేసామని, డివిజన్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు స్టేషన్లలోని రద్దీ సరళిని గమనిస్తూ, పర్యవేక్షించడానికి ఒక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసామని తెలిపారు. ప్రధాన స్టేషన్లలో (విశాఖపట్నం, దువ్వాడ, విజయనగరం, రాయగడ, శ్రీకాకుళం) ఎటివిఎంల వద్ద టికెట్ విక్రయాల కోసం ప్రత్యేక కౌంటర్లు సహాయకులను ఏర్పాటు చేసామని, మొబైల్ టికెటింగ్ కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్లాట్‌ఫామ్ నంబర్ల గురించి ముందుగానే ప్రకటనలు చేయడం ద్వారా ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

గిరిజన్ భవన్‌లో కొమరం భీమ్ జయంతి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసి పోరాట యోధుడు కొమరం భీమ్ 125వ జయంతిని ఎంవిపి.కాలనీలోని గిరిజన్ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ మాట్లాడుతూ, ఆదివాసుల స్వయం పరిపాలన ఏర్పాటు కోసం కొమరం భీమ్ పోరాటం చేసిన స్ఫూర్తితో ఆదివాసులందరూ ముందుకుసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముత్యంగి ప్రసాదరావు, ట్రెజరర్ సీసా శోభన్, గిరిజన్ భవన్ చైర్మన్ జి.దాలిబాబు, భవన్ ట్రెజరర్ దేపూరి పూజ్య శేఖర్, వంతల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మాదినకు పద్మశ్రీ ఐవి.సుబ్బారావు 'రైతు నేస్తం' పురస్కారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పద్మశ్రీ ఐవి.సుబ్బారావు రైతు నేస్తం పురస్కారానికి విశాఖపట్నం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాదిన ప్రసాదరావును ఎంపిక చేసినట్టు రైతు నేస్తం చైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాల కార్యక్రమం ఈ నెల 26వ తేదీన హైదరాబాద్ శంషాబాద్ దగ్గర ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రైతు నేస్తం, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ పురస్కారం అందచేస్తారని తెలిపారు. డాక్టర్ మాదినకు రైతు నేస్తం పురస్కారం ప్రకటించడం పట్ల రాష్ట్ర పశుసంవర్ధక డైరెక్టర్ డాక్టర్ దామోదర్ నాయుడు, అదనపు డైరెక్టర్ డాక్టర్ ఎండ సింహాచలం, విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శంకరరావు, ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మిక సమస్యలపై వినతి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ కేటగిరి –1 మినీ రత్న అయినందున డైరెక్టర్ (షిప్ బిల్డింగ్) జి.వెంకటేశ్వర్లుకు షిప్ యార్డ్ సిఐటియు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్మిక సమస్యలపై వినతి పత్రం అందించారు. గార్డెన్ రీచ్ షిప్ యార్డ్ మినిరత్న అయినప్పుడు అక్కడి ఉద్యోగులకు మూడు ఇంక్రిమెంట్లు ఇచ్చినట్లు ఇక్కడ కూడా అందరికీ ఇవ్వాలని కోరారు. గార్డెన్ రీచ్ షిప్ యార్డ్‌లో 17 మంది ఎఫ్‌టిఇ సిబ్బందిని ఎటువంటి పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండా పర్మినెంట్ చేశారని, అదే మాదిరిగా ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఎల్ అండ్ ఎం సిరీస్ కోసం అక్టోబర్‌లో లెటర్‌లో ఇచ్చిన ఫ్రెష్ అపాయింటమెంట్‌ను మార్చాలని, మినీ రత్న అయితే గత వేజ్ రివిజన్ అగ్రిమెంట్ ప్రకారం రిటైర్ ఉద్యోగులకు మెడికల్ స్కీం వర్తింపు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, అధ్యక్షులు వి.ప్రసాద్, గౌరవాధ్యక్షులు జి.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ బిఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులు ఈ నెల 28వ తేదీ రాత్రి 11:59 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విశాఖపట్నం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. అభ్యర్థులు www.dbtyas-sports.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

దివాకర్ రాయ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఆచార్యులు, ప్రముఖ హేతువాది ప్రొఫెసర్ కెఆర్.దివాకర్‌రాయ్ మృతి పట్ల భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు సంతాపం తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, VISAKHAPATNAM
E.P. No.35/2014 in O.S.No.101/2008
Between:
Haji Jakaria Haji Ebrahim, Regd. Firm rep. by its GPA Holder, Kakinada and others ...DHrs/Plaintiffs
and
Bolem China Demudu (died) and others ...JDrs/Defendants
To: JDr10: Lalam Annapurna, W/o. (late) Srinivasarao, C/o. Lalam Sambamurthy, Velama Veedhi, 4th Ward, Narsipatnam, Anakapalli District.
JDr12: Bolem Srinivasarao, S/o. (late) B.Tatalu, R/o. D.No.120, Dwarakanagar, Kothaveedhi, Narsipatnam, Anakapalli District.
JDr13: Bolem Peda Venkunaidu, S/o. (late) B.Tatalu, Sai Gopala Nivas Apartment, Opp. Golla Apparao House,Dwarakanagar, 2nd Lane, Narsipatnam, Anakapalli District.
పై నెంబరు అమలు గ్రంథములో 10వ, 12వ మరియు 13వ JDrs అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**30-10-2025** తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
D.SIMHADRI, Advocate
VISAKHAPATNAM
MD.AHMED ALI, Advocate
KAKINADA, Cell: **9848403336**

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DIST JUDGE AT VISAKHAPATNAM
A.R.B.O. P 04 /2025
Between:
Addanki Sateesh Kumar
S/o A. prabakar Rao, Hindu, aged about: 43 years, R/o Door number: Villa No:DL-41, panorama Hills, Sriram properties, law college road, Yendada, Visakhapatnam-45, AADHAR:812798459666, Cell :8143581435 . . . petitioner
And:
1.M/s ESSEM ECOFRI PVT LTD, Rep by its, and another ...Respondents
NOTICE
R-1: M/s ESSEM ECOFRI PVT LTD, a company incorporated under the companies act, 2013, With the registered office at Door number: 74-8/1/1/1 Plot number: 31, 2nd Cross Road, JD Nagar, Patamata Vijayawada-520007, R/o, Abilash Marupilla, S/o M Srinvasa rao, aged about; 35 years Plot number: A-85, Door number: 1, Road number:11, film Nagar, Sree Vara Sidhi Nivas, Shaikpeta, Hyderabad, AADHAR number 735122789068, Cell number: 9100101011
R-2: Rambhala Bhaskar Kiran, S/o Narayana Murthy, Aged about: 29 years, Door number: Door number: 4/11A, Chinna Veedhi chivara, Vinaykuni gudi, Vadda, Mummidivaram, East Godavari Dist 533222, Cell number: 9294979999
The above named petitioner filed the above said petition against the Respondents to Ex-party interim injunction against the R-1 AND R-2 is making hectic efforts to sell away the car no:AP 40 BD 0222, AUDI Q7 55 TFSI Q TECH which is against the terms and conditions of the agreement dated on 15th March 2024 is not entitle to sell way the said car without resorting to Arbitration proceedings however petitioner is intending to go for Arbitration proceeding but in the mean while R1and R2 to be restraining from alienating the said Car to third parties and for other reliefs and the matter coming for your appearance and stated posted to day **18-11-2025. By 10-30 A.M** either personally or through advocate before the above said Honorable court failing which the Honorable court is decided under the court of law.
P.R.VARMA, Advocate,
Visakhapatnam. Cell 9581216957

టిడిపి మండల కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి - ఆనందపురం: రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. బుధవారం తర్లువాడలో ఆనందపురం మండల టిడిపి కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, టిడిపి ఆవిర్భావం నుంచి ఆనందపురం మండలం ఆ పార్టీకి కంచుకోటగా నిలుస్తోందని, దాన్ని కొనసాగించేలా కొత్త కమిటీ పనిచేయాలన్నారు.టిడిపి, జనసేన, బిజెపి కూటమి కుటుంబమని, ఏమైనా స్వల్ప విబేధాలుంటే సర్దుకుపోయి సమిష్టిగా ముందుకు సాగాలనిపిలుపునిచ్చారు. గూగుల్ డేటా వచ్చిందని, దీనికి భూములిచ్చి తోడ్పాటునందించిన రైతులను సంతృప్తిపరిచే చర్యలను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని భరోసానిచ్చారు. భూముల పరిహారం, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు అన్నీ అందించేందుకు చంద్రబాబు కట్టుబడి ఉన్నారనా్రు. గంభీరం ఐఐఎం భూసేకరణ పరిహార విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అంతకుముందు, ఆనంద పురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుండి తర్లువాడ జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు అధ్యక్షతన మండల పార్టీ అధ్యక్షులు తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, సరగడ అప్పారావు, నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, చిక్కాల విజయబాబు, గాడు వెంకటప్పుడు, ఎర్ర రాజు, కె.శ్రీకాంత్ రాజు, కర్రి శ్రీనివాస్, గండ్రెడ్డి సోంబాబు, పొంద్రంగి అప్పలరాజు, బలిరెడ్డి మల్లికార్జునరావు, లొడగల అప్పారావు, కాకర రమణ, బంకు రాజు, నాగోటి సత్యనారాయణ, కసిరెడ్డి దామోదరరావు, వాండ్రాసి అప్పలరాజు, చెట్టిపల్లి గోపి పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభం

తగరపువలస : భీమునిపట్నం మండలం లక్ష్మీపురం గ్రామంలో అయ్యప్ప సేవాపీఠంలో నిత్యాన్న ప్రసాద వితరణను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు.లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు మాట్లాడుతూ 41రోజుల పాటు నిత్యాన్న దాన ప్రసాదాన్ని అయ్యప్ప భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు. జి ఎల్లయ్య పాల్గొన్నారు.

సమన్వయంతోనే భీమిలి ఉత్సవ్ విజయవంతం

భీమునిపట్నం : జివిఎంసి, పర్యాటక, విద్యాశాఖ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతోభీమిలి ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంవిపి కాలనీలోని క్యాంపు కార్యాలయంలోభీమిలి ఉత్సవ్ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజలకు, పర్యాటకులకు అనుకూలమైన తేదీల్లో భీమిలి ఉత్సవ్ నిర్వహించాలన్నారు. భీమిలి చారిత్రక నేపథ్యాన్ని, విశిష్టతను తెలియజేసేలా ఉత్సవాలు నిర్వహించా లన్నారు. కోలాటం, బీచ్ వాలీ బాల్, కబడ్డీ తది తర సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ కల్యాణి, జిల్లా అధికారి మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, జెడ్‌సి ఒ మ్మి అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

నలుగురు క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యుల అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు క్రికెట్ బెట్టింగ్ ముఠా సహాయకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్స్ఛేంజ్ 666 అనే అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌పై దర్యాప్తు చేపట్టారు. అధిక లాభాల ఆశతో ఈ యాప్‌లో నిరంతరం బెట్టింగ్ ఆడుతూ, ఇతరులకు కూడా ఈ విధానం చెప్పి, తమ సొంత ఐడిల ద్వారా ఇతరులను బెట్టింగ్‌లో పాల్గొనేలా చేస్తున్న నలుగురిని అత్యంత సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక నిఘా విభాగం పట్టుకుంది. అరెస్ట్ అయిన వారిలో అనకాపల్లి జిల్లాకు చెందిన గనగళ్ల బంగార్రాజు (31), కొరుప్రోలు పూర్ణ కిషోర్ (29), మేడిశెట్టి రాజు (38), విజయనగరం జిల్లాకు చెందిన గడిదేశి ఈశ్వరరావు (39) ఉన్నారు. వీరి నుంచి బెట్టింగ్‌కు వినియోగిస్తున్న మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

11 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ పర్యవేక్షణలో, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు నేతృత్వంలోని సిబ్బంది సోమవారం రాత్రి నక్కవానిపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న గ్యాంగ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న కొందరు చీకటిలో పారిపోగా, నిర్వాహకుడితో పాటు 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తులో అగనంపూడి దొంకాడ కాలనీకి చెందిన జెర్రిపోతుల శివ ప్రధాన నిర్వాహకుడిగా గుర్తించారు. శివ లంకెలపాలెం వద్ద ఒక రెస్టారెంట్ నడుపుతూ పేకాటను సవ్యంగా నిర్వహిస్తూ ఉన్నాడని పోలీసులు తెలిపారు. దాడిలో రూ.19,20,300 నగదు, 17 మొబైల్ ఫోన్లు, 2 బైకులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ మేనేజర్ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ పి సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు ముందుగా విజిలెన్స్ వారోత్సవాలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు

కూటమి కార్పొరేటర్లతో సమావేశం

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని లాసన్స్ బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గ కూటమి పార్టీ కార్పొరేటర్లతో విశాఖ ఎంపీ శ్రీభరత్ సమావేశం నిర్వహించారు.కార్పొరేషన్ ఎన్నికలు, వార్డు అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించారు. , ఈ సందర్భంగా 26వ వార్డులో యూపీ హెచ్‌సి నూతన భవనం నిర్మించాలని, కూరగాయలు మార్కెట్‌పై అంతస్తు భవనం నిర్మించాలని ఎంపీ శ్రీభరత్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ శ్రావణి తెలిపారు. వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

బోధకాలు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఆనందపురం : వేములవలస ఆనందపురం ఎస్‌సి, బిసి కాలనీలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బ్రైట్ ఫ్యూచర్ ట్రస్ట్ సహకారంతో ఆర్ఎంపీలకు బోదకాలు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎంహెచ్ఓ గురు నాథరెడ్డి, పారామెడికల్ డిప్యూటీ, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ నరేంద్ర కుమార్ పాల్గొని గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించి, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, కార్యదర్శి గెద్ద చిరంజీవి, సంఘ గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, నాయకులు సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, గొట్టుముక్కల రఘు, పచ్చి పులుసు కనకారావు, కేఎన్ రావు, రామ కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి పడాల వినోద్, మహిళా నాయకులు కోరాడ వరలక్ష్మి, కాంచన పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి మధురవాడ, రేవళ్లపాలెం ఫీడర్లలో రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో గురువారం వెస్ట్‌విండ్ అపార్ట్‌మెంట్, రేవళ్లపాలెం, భాస్కర్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఏపిఈపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం డిఇఇ సింహాచలం నాయుడు తెలిపారు.

అష్ఫాకుల్లా ఖాన్‌కు గుర్తించకపోవడం బాధాకరం

ప్రజాశక్తి- సీతమ్మధార : స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా కాకోరి రైలుదాడి ఘటనలో కీలకంగా వ్యవహరించి, 27ఏళ్లకే ఉరికంబాన్ని ముద్దాడిన స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ గురించి ఎవరికీ పెద్దగా తెలియకపోవడం దురదృష్టకరమని ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డిజిపి జె.పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం అష్ఫా కుల్లా ఖాన్ జయంతి సందర్భంగా పౌర గ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్ అల్లూరి వంటి స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి, వారి జయంతి, వర్ధంతులను నిర్వహిస్తున్నా, ఆజాద్‌తో కలిసి పనిచేసిన అష్ఫాకుల్లా ఖాన్‌ను కనీసం స్మరించకపోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంతో త పార్టీ తరపున జయంతి నిర్వహణతోపాటు వచ్చే డిసెంబర్ 19న అష్ఫాకుల్లా ఖాన్ వర్ధంతిని తాము నిర్వహిస్తా మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అష్ఫాకుల్లా ఖాన్‌ను గుర్తించాలన్నారు. మత వివక్షతోనే అష్ఫాకుల్లా ఖాన్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముస్లిముల హక్కుల కోసం తమ పార్టీ తరపున పోరాటం చేస్తామ న్నారు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నాగుల చవితికి జూపార్క్‌లో ముందస్తు ప్రవేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 25న జూపార్క్‌లోకి సాధారణం ప్రవేశం కంటే ముందుగానే అనుమతిస్తున్నట్లు క్యూరేటర్ జి.మంగమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగుల చవితి రోజున జూ పార్క్ ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తెరిచి ఉంటుందన్నారు. భద్రత, పరిశు భ్రత దష్ట్యా జూఆవరణలో పటాకులు, పేలుడు పదార్థాలు ఇతర నిషేధిత వస్తువులు అనుమతించబడవన్నారు. .నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతో సహా కఠినచర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన ఆనందించే వాతావరణాన్ని అందించేందుకు ప్రవేశద్వారం వద్ద సందర్శకులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా

వైసిపి కోటి సంతకాల సేకరణ

భీమిలిలో బస్సులో సంతకాల సేకరణలో వైసిపి నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యకళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతోంది. ఇందులో భాగంగా బుధవారం గిడిజాల పంచాయతీలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీను (చిన్న శ్రీను) ఆదేశాలతో మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రింకి శ్రీను, స్థానిక సర్పంచ్ షినగం అప్పలరాజు, నాయకులు షినగం రాంబాబు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు.

పద్మనాభం: . మండలంలోని ఐనాడ గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి ఎస్ గిరిబాబు, మామిడి శివ పాపారావు, కె. రామేశ్వరరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : వైసిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్‌స్టాండ్ వద్ద కోటి సంతకాల సేకరణ చేపట్టారు పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు, అధ్యక్షులు సి.రమ్య, ఉపాధ్యక్షులు తోట వాసు, ఎంపిపి వాసురాజు, వార్డు ఇంచార్జి ఎం షణ్ముఖరావు, అధ్యక్షులు ఎ నరసింగరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : 10వ వార్డు వైసిపి అధ్యక్షులు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలోబూత్ కన్వీనర్లు బీటీ నాయుడు, ఎస్ గోవింద రాజు, మాచర్ల రవికుమార్ ఇంటింటికి వెళ్ళి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రయివేటీకరణపై కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. వార్డు యువజన అధ్యక్షుడు కంటుబోతు తులసీరామ్, రవీంద్ర చౌదరి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపిపి పంచాడ సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణను మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, నాయకులు కర్రి సూరినాయుడు, బూరె బాబురావు, ఈర్లె అనురాధ నాగిరెడ్డి పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి- కొమ్మాది: వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులకు సహకరించాలని ఐదోవార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు మొల్లి హేమలత కోరారు. బుధవారం మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డులో పాడైన రోడ్లన్నీ బాగుచేయాలని, కొండపైనున్న శారద నగర్ కాలనీ నివాసితులకు తాగునీరు అందించేందుకు ట్యాంకు నిర్మాణం చేపట్టాలని, శివశక్తి నగర్ కాలనీలో కాలువల నిర్మించాలని, రాజీవ్ గృహకల్ప కాలనీల్లో యుజిడి, రహదారుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌టిఆర్ హుదూద్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ వేయాలని కోరారు. దీనిపై మేయర్ స్పందిస్తూ, తక్షణమే అంచనా ప్రతిపాదనలు రూపొందించి, పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారన్నారు.

చిన్న పరిశ్రమల నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి-పద్మనాభం : ప్రభుత్వమిచ్చిన రాయితీలు, రుణాలను సద్వినియోగం చేసుకుని చిరు పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఔత్సాహికులంతా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎంఎస్ఎంఇ కోఆర్డినేటర్ సాగర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో చిన్నపరిశ్రమల నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంచుకోవడంతోపాటు గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌తో ప్రభుత్వాల నుంచి రుణాలను పొందవచ్చన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరిశ్రమలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ జయ ఉమ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రచారం

ప్రజాశక్తి-పద్మనాభం : ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నేతలు సూచించారు .బుధవారం. మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం, రెడ్డిపల్లి, కోరాడ, అయినాడ రేవిడి గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కెవివి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు అశ్విని వర్మ, జిల్లా ఆర్గనైజర్ గౌతమి కుమార్, స్టేట్ జనరల్ సెక్రెటరీ జి మహేష్, పాల్గొన్నారు.

పారదర్శకంగా కొత్త విద్యుత్ కనెక్షన్లు

నూతన మార్గదర్శకాలు జారీ: సిఎండి పృథ్వీతేజ్

పృథ్వీతేజ్ ఇమ్మడి, సిఎండి

ప్రజాశక్తి- సీతమ్మధార: కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో పారదర్శకత, సత్వర సేవలు అందించేందుకు ఎపిఇఆర్‌సి నియమావళికి అనుగుణంగా నూతన విధానం అమల్లోకి వచ్చిందని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రకటనలో వెల్లడించారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ కనెక్షన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఛార్జీల అమలులో పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా, విద్యుత్ నియంత్రణమండలిలోని మార్గదర్శకాలకు అవసరమైన సవరణలు చేపట్టినట్లు తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఒకే విధమైన, పారదర్శక ఛార్జీలను అమలు చేయనున్నామన్నారు. ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు, ఎస్టిమేట్ తయారీ అవసరం లేకుండా కొత్త నియమావళి అమలుతో విద్యుత్ కనెక్షన్ జారీ ప్రక్రియ మరింత సరళంగా, పారదర్శకంగా, వేగవంతంగా మారనుందని వెల్లడించారు కొత్త విధానంలో ఇప్పటికే విద్యుదీకరణ జరిగిన కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతంలో 150 కిలోవాట్ల వరకు ఎల్‌టి కనెక్షన్లకు,అదనపు లోడ్‌కు ఫిక్స్‌డ్ కనెక్షన్ ఛార్జీలు నిర్ణయించబడ్డాయన్నారు. కిలోమీటరు దూరానికి మించి ఉన్న ప్రాంతాలకు, కొత్త లేఅవుట్ల విద్యుదీకరణకు, వ్యవసాయ, అనుబంధ కనెక్షన్లకు, అండర్‌గ్రౌండ్ కేబులింగ్ అవసరమయ్యే సందర్భాల్లో ఈ ఛార్జీలు వర్తించవన్నారు. అప్లికేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్ వంటి ఇతర రుసుములు మాత్రం ప్రస్తుత నియమావళి ప్రకారం కొనసాగుతాయన్నారు.

ముందుగా గుర్తిస్తే రొమ్ము కేన్సర్ నయం

డాక్టర్ పైడి వెంకటేష్, మెడికల్ ఆంకాలజిస్ట్,

ప్రజాశక్తి- కొమ్మాది : వయసు నిమిత్తం లేకుండా మహిళల్లో విజృంభిస్తున్న రొమ్ము కేన్సర్‌ను ముందుగా ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయడం సులభతరమని ఒమెగా హాస్పిటల్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పైడి వెంకటేష్ అన్నారు. రొమ్ము కేన్సర్ నివారణ మాసోత్సవాల సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ, మెమొగ్రఫీ పరీక్ష ద్వారా మొద రొమ్ము కేన్సర్ గుర్తించవచ్చన్నారు. మహిళ శరీరంలో ఇతర భాగాల కంటే రొమ్ముపై చర్మం రంగు భిన్నంగాఉన్నా, రొమ్ము పైభాగాన్ని నొక్కినప్పుడు అది లోపలికి వెళ్లి బయటకు రాకుండా అలాగే ఉండిపోయినా, రెండు ఛాతి పరిమాణాల్లో తేడా వచ్చినా, రొమ్ములో కణితులు ఏర్పడినా, రక్తసంబంధీకుల్లో ఎవరికైనా కేన్సర్ వున్నా జన్యుపరంగా సంక్రమించే ప్రమాదం ఉన్నందున సంబంధిత మహిళలు ముందుగా వ్యాధి నిర్ధారణకు మామూగ్రఫీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 40ఏళ్ల దాటిన మహిళలు ఏడాదికి ఒకసారి రొమ్ముకేన్సర్ నిర్ధారణకు మామూగ్రఫీ చేయించుకోవడం మంచిదన్నారు. రొమ్ము కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే, సర్జరీ, కీమో, రేడియేషన్ చికిత్సవిధానాల్లో ప్రాణాలు కాపాడవచ్చని డాక్టర్ పైడి వెంకటేష్ సూచించారు.

ఎముకలు బలహీనపడితే ప్రమాదమే

ప్రజాశక్తి- మధురవాడ : ఎముకలు బలహీనపడితే శరీరం వైకల్యానికి దారితీసే ప్రమాదం ఉందని గీతం ఆసుపత్రి (జిమ్‌సర్) వైద్యనిపుణులు అన్నారు. బుధవారం వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా పెదగాలిపేట యుపిహెచ్‌సిలో గీతం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు వందమంది రోగులకు ఎముకల పటుత్వ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగం నిపుణుడు డాక్టర్ హరీష్ మాట్లాడుతూ, ం ఏటా తమ విభాగానికి చికిత్సకు వచ్చే వారిలో 20 శాతం మంది వైద్యపరిభాషలో ఆస్టియోపోరోసిస్‌గా పిలవబడే ఎముకల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. దేశంలో వృద్ధులలో 37 శాతం మహిళలలో 33.1 శాతం మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని, సకాలంలో వైద్యులను సంప్రదించడం ద్వారా వ్యాధి తీవ్రత పెరగకుండా చూడొచ్చన్నారు.

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ
- మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణకు వస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరిక

గాజువాకలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి- గాజువాక : అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాజువాకలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహన్ మాట్లాడుతూ, పెదగంట్యాడలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వేలాదిమంది పాల్గొని అదాని సిమెంట్ కంపెనీ వద్దంటూ నినదించి, పెద్ద ఎత్తున నిరసన తెలిపారన్నారు. అయితే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్ కంపెనీ ఏర్పాటును రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజల వ్యతిరేకతతో వెనక్కి తగ్గిన అధికారులు, ప్రజాభిప్రాయసేకరణను వాయిదా వేసి మళ్లీ నిర్వహిస్తామని అంటున్నారే తప్ప, రద్దు ప్రకటన చేయలేదన్నారు. మరోమారు ప్రజాభిప్రాయసేకరణకు అంటూ ఇక్కడకు వస్తే అన్ని పార్టీల వారు రాజకీయాలకు అతీతంగా తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యంతో అవస్థలు పడుతున్న ప్రజలు, సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోరన్న విషయాన్ని గుర్తించాలన్నారు.. ఇంత జరుగుతున్నా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అదానీ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని ప్రకటించడానికి బదులు, వారికి వత్తాసు పలికే విధంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ కూడా దీనిపై స్పందించకపోవడం శోచనీయమన్నారు. నిరసనలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎ.అజయ్, జిల్లా కార్యదర్శి ఎల్‌జె. నాయుడు డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మౌనిక, శశి రాము, విశ్వ,హేమ, భారతి, కావ్య, భరత్, సూర్య, ధనుష్ పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డ్ బ్రిడ్జిని ప్రారంభించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న పైడిరాజు

ప్రజాశక్తి- ములగాడ: నేవల్ డాక్‌యార్డ్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో డాక్‌యార్డ్ వెళ్లే రహదారి రైల్వే ట్రాక్ క్రాసింగ్ వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ 2024ఆగస్టు ఒకటిన మూసేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ డాక్‌యార్డ్ బ్రిడ్జిని 9 నెలలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రభుత్వం, పోర్ట్ ప్రకటించిం దన్నారు. నత్తనడక పనులతో అయితే నేటికి 14 నెలలు గడిచినా బ్రిడ్జి పూర్తవ్వలేదన్నారు. దీనిపై ఈనెల 17న పోర్టు ఛైర్మన్,జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలను అంద జేశామన్నారు. పూర్తవుతున్న బ్రిడ్జి ప్రారంభం కాక పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డాక్‌యార్డ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిచిన తర్వాత జింక్ గేట్ నుండి సింధియా మల్కాపురం యారాడ వరకు సుమారు రెండు లక్షల మంది రక్షణ రంగం, షిప్‌యార్డు హెచ్‌పిసిఎల్ ఐఒసి కోరమండల్ తదితర పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ డాక్‌యార్డ్ బ్రిడ్జి మూసేసిన తర్వాత మారుతిజంక్షన్ మీదుగా రాకపోకలతో దూరం పెరగడంతోపాటు అక్కడ జరిగిన ప్రమాదాల్లో ఏడాదిలోనే ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయా రన్నారు. అంతేకాక ఈ మార్గంలో మూడు రైల్వే క్రాసింగ్‌లో ఉండడంతో రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. తక్షణమే డాక్‌యార్డు వంతెన వినియోగం లోకి తెచ్చే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు కె. పెంటా రావు, ఎ. సత్యారావు, ఎన్. శ్రీనివాసరావు, బూడి. శ్రీను కార్యకర్తలు జి.నరేష్ డి. రాజేష్ ప్రేమ్, సమీన్,గణేష్, మహేంద్ర, ఏసుబాబు, నీలయ్య, ఎల్ రాజు, కిరణ్, నాగేష్, ప్రశాంత్, సురేష్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

విసిల మార్గనిర్దేశనంలో ఎయు పురోభివృద్ధి

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- సీతమ్మధార : శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్రాయూనివర్సిటీ పురోభివృద్ధిలో పూర్వ ఉపకులపతుల కృషి, మార్గనిర్దేశనం ఎంతో ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల జూబ్లీహాల్‌లో సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్(సిడార్) ఆధ్వర్యంలో 'ఆంధ్ర విశ్వవిద్యాలయం విజనరీస్: 100 సంవత్సరాలలో 19 వైస్ ఛాన్సలర్ల పాత్ర' పేరిట తెలుగు, ఇంగ్లీష్‌లో ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు. పుస్తక రచయితలలో ఒకరైన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ విసి ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ 19మంది విసిల పేర్లను చదివి వినిపించారు. వీరిలో 14 మంది మానవీయ శాస్త్రాల నేపథ్యం వారుకాగా, మిగిలిన ఐదుగురు సైన్స్ ఇంజనీరింగ్ నేపథ్యం నుంచి వచ్చారన్నారు. సిడార్ అధ్యక్షుడు, ఆర్‌జియుకెటి మాజీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.సి. రెడ్డి ప్రారంభోపన్యాసంలో శతాబ్ది విశ్వ విద్యాలయాన్ని దార్శనిక నాయకులు నడిపించారని కొనియాడారు. ముఖ్య అతిథి, ఆర్థిక విద్యుత్ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి డాక్టర్ ఇఎఎస్.శర్మ మాట్లాడుతూ, ఎయు శతాబ్ది చరిత్రను పుస్తకంలో పొందుపరిచారన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ మాట్లాడుతూ స్వర్ణోత్సవ ఎయులో చదువుకున్న తాను, అదే వర్సిటీ శతాబ్ది వేడుకల్లో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. 1973లో ఇదే కాలేజీలో మొదటి తరగతులు నిర్వహణ ద్వారా ఎయు ప్రారంభమైందన్నారు. ఎయు పూర్వ విసిలు బీల సత్యనారాయణ జివిఎస్ఎన్ రాజు, డాక్టర్ అంబేద్కర్ వర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ ఎస్‌వి. సుధాకర్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి. రమణమూర్తి, కృష్ణ వర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ ఎస్. రామకృష్ణ, ఎన్. వినయ భూషణరావు ఎయుతో తమ అనుబంధాన్ని వివరించారు. పలు వర్సిటీల విసిలు, ప్రొఫెసర్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సౌకర్యాలపై ఆరా

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లా కేంద్రకారాగారంతోపాటు పలు హాస్టళ్లను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు బుధవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నంశెట్టి రాజు ఆదేశాలతో సెంట్రల్‌జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత న్యాయ సదుపాయానికి చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం దీనదయాళ్‌పురం ప్రభుత్వ బాలుర గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాలను, డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయా గృహాల్లో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు, విద్యా సౌకర్యాలను పరిశీలించారు. బాలల హక్కుల పరిరక్షణ, వారికి చట్ట పరంగా న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు.

శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి- తగరపువలస: దివ్వాడ దివిస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా మహిళలకు మూడు నెలలపాటు నిర్వహించిన మగ్గం వర్క్ శిక్షణ బుధవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా దివిస్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పి జగదీష్ పాల్గొని, కోర్స్ పూర్తిచేసిన 40 మంది మహిళలకు సర్టిఫికెట్స్ అంద జేశారు. ఈ సందర్భంగా దివిస్ జిఎం మాట్లాడుతూ దివిస్ సంస్థ చుట్టుపక్కల పంచాయతీలలోని మహిళలకు వివిధ నైపుణ్య కోర్సుల్లో శిక్షణనిస్తూ స్వయంఉపాధికి ప్రోత్సా హిస్తోందన్నారు. సిఎస్ఆర్ అధికారి డి సురేష్ కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, ఎం బిందు శిరీష పాల్గొన్నారు

విద్యాబోధనపై సంతృప్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగోవార్డు నిడిగట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్ కుమార్ బుధ వారం సందర్శించారుజ పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు . విద్యార్థుల సమాధానాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు చక్కని బోధన అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఎంఇఒలు ఎం శివరాణి, ఎ జయప్రద ఉన్నారు

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

వైద్యశిబిరంలో ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి -ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ కళ్యాణమండపంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ప్రారంభించిన శిబిరంలో 300 మంది మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ, సఖి సురక్ష కార్యక్రమం ద్వారా మహిళలకు రక్తపోటు మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్ గుండె జబ్బులు, రక్తహీనత, పలు కేన్సర్ల నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీరామ్, సిఒ అప్పలకొండ, వార్డు అధ్యక్షులు గాడి సత్యం, పోతకొండ ధర్మారావు, ఇన్‌ఛార్జిలు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరి గోవింద్, ఏడువాక సన్యాసిరావు, నీలి పైడిరాజు, వడ్డి నాగరాజు బాలస్వామి, సురేష్, మజ్జి రమణి, వడిసెల శ్రీను, జక్కన్న పాల్గొన్నారు

కస్తూర్బా పాఠశాల సందర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిని విద్యాశాఖ ఆర్‌జెడి విజయభాస్కర్ బుధవారం సందర్శించారు 7 నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించారు. సిలబస్ ఏమేరకు పూర్తయింది, అందుకు అనుగుణంగా నోట్స్ రాశారా, లేదా అనేది నిశితంగా పరిశీలించారు. ఆరో తరగతి నుంచే పిల్లలకు చదవడం, రాయడం నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం, కూరగాయల స్టోర్ రూమ్ ను పరిశీలించారు జిసిడిఒ శ్రీదేవి, ప్రిన్సిపాల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. .

తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి అనిత



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి అనిత

ప్రజాశక్తి-అనకాపల్లి

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో అత్యవసర సమీక్ష నిర్వహించిన రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 24 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదిలే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీవ్ర అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి బాపట్ల, నెల్లూరు, ప్రకాశం రాయలసీమలో కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు, రేపు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రానున్న 5 రోజులు విస్తృతంగా పిడుగులతో కూడిన వర్షాలు, 35-55కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హోంమంత్రి అనిత సూచించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. శిథిలావస్థలో నిర్మాణాల్లో ఉండే వారిని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విపత్తుల శాఖ స్పెషల్ సీఎస్ జి.జయలక్ష్మీ, మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

అనకాపల్లి : అల్పపీడనం పట్ల జిల్లా యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అప్రమత్తం చేశారు. రానున్న రెండుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, డివిజన్, మండలం స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, కొంటర్ రూమ్ నెంబర్లను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆమె ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 125 గ్రామాల లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్ లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వాటిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని ఆయన ఆదేశించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, అనకట్టలు తనిఖీ చేయాలన్నారు. సిబ్బంది 24 గంటలు అప్రమత్తం గా ఉండాలని, గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేటట్లు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. రోడ్లపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే చెట్లను తొలగించుటకు అవసరమగు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మంచినీళ్లు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. నీట మునిగే గ్రామాలు, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితులు గమనించాలన్నారు. హైరిస్కు గల గర్భిణీ స్త్రీలను ముందుగా ఆస్పత్రికి తరలించాలన్నారు. విద్యుత్తు అంతరాయం ఏర్పడితే గంట సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించేటట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, జిల్లా సివిల్ సప్లై అధికారి మూర్తి, పంచాయతీ అధికారి సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సహాయం కొరకు కంట్రోల్ రూమ్ నెంబర్లు 08924288888, 08924225999, 08924226599కు ఫోన్ చేయాలని తెలిపారు.

పూడిమడక తీరంలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో పూడిమడక సముద్ర తీరంలో బుధవారం మత్స్యకారులు నిరసన తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్ వద్దు గంగమ్మ తల్లి ముద్దు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, పూడిముడక శాఖ కార్యదర్శి చాపల తాతయ్య, మండల కమిటీ సభ్యులు కె సోమునాయుడు మాట్లాడుతూ రాజయ్యపేట వద్ద 1270 ఎకరాల్లో అత్యంత కాలుష్యకారక బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును మత్స్యకారులు శాంతియుత ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అయినా మత్స్యకార గ్రామంలో సెక్షన్ 30, పోలీస్ పికెట్లు పెట్టి ప్రజలనికన్ని భయభ్రాంతులను గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పోలీసు నిర్బంధం ఎత్తివేసి ప్రజాభిష్టం మేరకు బల్క్ డ్రగ్ పార్కు ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణ, అమ్మోరు, గంటలరావు, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : పాము కాటుకు గురై ఒక మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని చౌడువాడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మతురాలు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గంగుమల్ల లక్ష్మి (55) మంగళవారం సాయంత్రం గ్రామంలో గల తన నివాసం వద్దగల కట్టెల బడ్డీ కప్పు కొన్న ప్లాస్టిక్ కవర్లను తొలగిస్తుండగా అందులో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చౌడువాడ పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కొరకు స్థానిక 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందారు. మృతురాలి కుమారుడు మరిడియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి భర్త గతంలో చనిపోయారు. వారికి ఇద్దరూ ఆడపిల్లలు, ఇద్దరూ మగ పిల్లలు ఉన్నారు.

డివిజన్ స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజనల్ స్థాయి ఆటల పోటీలు జరిగాయి. 12 మండలాల నుంచి ఎంపికైన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఖోఖో 576, చెస్ 240, బ్యాడ్మింటన్ 240 మంది పాల్గొనగా వారి నుంచి అనకాపల్లి డివిజన్ జట్టు ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రారంభించగా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కెఎం నాయుడు, డివిజనల్ కోఆర్డినేటర్ ఎస్‌వి నరసింహం, 12 మండలాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. త్వరలో జరగబోవు జిల్లా ఎంపిక ప్రక్రియలో వీరు పాల్గొంటారు.

జిల్లాస్థాయి పోటీలకు కెజిబివి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో కెజిబివి విద్యార్థినులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు బి బాలశ్రీ, చదరంగం పోటీలకు నవ్య ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు వారిని, వ్యాయామ ఉపాధ్యాయురాలు దేవరపు బేబీరాణిని అభినందించారు.

ఖేలో ఇండియా గేమ్స్‌లో విశాఖ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో ఖేలో ఇండియా అస్మిత పెన్ కాక్ సిలాట్ విమెన్స్ లీగ్‌ను నిర్వహించారు. ఈ లీగ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో విశాఖ క్రీడాకారులు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు, ఉత్తరాంధ్ర పెన్ కాక్ సిలాట్ చీఫ్ పాట్రన్ గురు దయమయ, సౌత్ జోన్ పెన్ కాక్ సిలాట్ అధ్యక్షులు పి.మనోజ్ సాయి, యాంటీ కరప్షన్, ఇంటెలిజెన్స్ కమిటీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడగల సన్యాసిరావు మాట్లాడారు. వర్సిటీ స్పోర్ట్స్ పీడీ ఎం.మంగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

హెల్త్ అలవెన్స్ తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ తక్షణమే అమలు చేయాలని సిఐటియు నాయకులు లోవరాజు డిమాండ్ చేశారు. మాకవరపాలెం మండలంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు హెల్త్ అలవెన్స్ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు రూ.6000 చొప్పున చెల్లించాల్సి ఉండగా రూ.3000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కార్మికులకు సేఫ్టీ ప్రికాషన్స్ లేక అనారోగ్యం పాలవుతున్నారని, తక్షణమే వీరిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు ఈ చిరంజీవి, కత్తియ్య, పోతురాజు, రామకృష్ణ, గోపి, యేసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అబ్దుల్ కలామ్ మార్గదర్శి

ప్రజాశక్తి-కశింకోట : విద్యార్థులకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ మార్గదర్శి అని అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక ఛైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ అన్నారు. కశింకోట బాలికల హైస్కూల్లో కలామ్ 94వ జయంతి ఉత్సవాలు బుధవారం నిర్వహించారు. కలామ్ విగ్రహానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వర్ణ కుమారి, పెంటకోట కిషోర్, బంగారం, వెంకటేష్, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : బాల్య వివాహాలను అరికట్టాలని అప్పుడే, ఆడపిల్ల భవిష్యత్తు బాగుంటుందని ఎంపీడీవో, సువర్ణ రాజ్ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని, పాఠశాలలలో ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు, ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేయడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, సిడిపిఒ పి.లలిత కుమారి, సూపర్వైజర్లు కళ్యాణి, ఆదిలక్ష్మి, రాములమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డులో కూరుకుపోయిన లారీ

రోజంతా నిలిచిపోయిన వాహన రాకపోకలు

బురద గోతులో కూరుకుపోయిన లారీ

ప్రజాశక్తి-వడ్డాది : భారీ లోడుతో బుచ్చయ్యపేట మండలం వడ్డాది వైపు మంగళవారం రాత్రి వస్తున్న లారీ బంగారు మెట్ట వద్ద బిఎన్ రోడ్డుపై గొయ్యిలో కూరుకుపోయింది. దీనిని ఒడ్డుకు లాగేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. రెండు జెసిబిలతో లారీని ఒడ్డుకు లాగేందుకు తీవ్రంగా శ్రమించి బుధవారం సాయంత్రానికి ఆ లారీని గొయ్యిలో నుండి తీశారు. దీంతో బుధవారం సాయంత్రం వరకు వడ్డాది-రావికమతం మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లారీ రోడ్డు మధ్యలో అడ్డంగా దిగబడిపోవడంతో పెద్ద వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. మరికొన్ని గ్రానైట్ లారీలు ఇక్కడే నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, వివిధ వర్గాల ప్రయాణికులు, ఉద్యోగులు రాకపోకలు సాగించటానికి తీవ్ర అవస్థలు పడ్డారు. నర్సీపట్నం నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు అటు లోపూడి వరకు, ఇటు చోడవరం వైజాగ్ నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు బంగారు మెట్ట వరకు తిరిగాయి. ఈ మధ్య ఆటోల్లోనూ, లేదా నడుచుకుని వెళ్ళాల్సి వచ్చింది.

ఈ రోడ్డులో ప్రతిరోజూ అనుమతి లేకపోయినా రాత్రివేళ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ పెద్ద వాహనాలు గోతులలో కూరుకుపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. అక్టోబర్ నెలలోనే మూడు లారీలు ఈ గొయ్యిలో కూరుకుపోయాయి. బిఎన్ రోడ్లో భారీ వాహనాలను నియంత్రించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోతుల రోడ్డులో గ్రానైట్, బండరాళ్లతో వెళ్లే భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు ప్రమాదాలు జరుగుతాయేమోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామపంచాయతీలో ఉన్న వనరులు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవచ్చు, ఇంటి పన్నులు, గ్రామంలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకం, గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు వాటిలో మొక్కల పెంపకం, చిన్నచిన్న షాపులు ఏర్పాటు వంటి వాటి ద్వారా ఆదాయ వనరులు ఏవిధంగా పెంచుకోవచ్చో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణ రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డిఎతో వివిధ సమస్యలను పరిష్కరించాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలో పిఆర్టియు సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్మూర్తి, విజయ్ కుమార్, డేవిడ్, అబ్దుల్లా, ప్రతాప్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వ విఫలం

సిపిఎం నేతలు కోటేశ్వరరావు, శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఖరీఫ్ సీజన్లో రైతులకు సరిపడా ఎరువుల సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకర్రావు విమర్శించారు. స్థానిక దొడ్డి రామానాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో వుంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే ఎరువులను రైతులకు అందుబాటులో వుంచాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల కొరత రైతులలో తీవ్ర ఆందోళనకు దారితీస్తోందని పేర్కొన్నారు. ఎస్.రాయవరం మండలం సైతారుపేట గ్రామంలో మంగళవారం రైతులు యూరియా కోసం బారులుతీరి చివరికి తోపులాటకు దిగడం, పోలీసులను పిలిపించి పంపిణీ నిలిపివేయడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రభుత్వ వ్యవసాయ శాఖ వైఫల్యానికి తార్కాణమన్నారు. సైతారుపేట, పేటసూదిపురం గ్రామాల రైతులు తమకు సమానంగా ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేయగా, కూటమి నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం రైతులు మండిపడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కశింకోట మండలంలోని నూతలగుంటపాలెం, కశింకోట గ్రామాల్లో కూడా రైతులు యూరియా స్లిప్పుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేశామంటున్న సీఎం చంద్రబాబు చేతల్లో ఘోరంగా విఫలమయ్యారు. ఏ ప్రాంతంలో చూసినా ఎరువుల కొరత ఉంది. యూరియా, డీఏపీ కొరత రైతులను కలవరపెడుతోందని తెలిపారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత కోటేశ్వరరావు

రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తున్న ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట : మండలంలోని మంగళాపురం గ్రామానికి చెందిన తుంపాల రామకృష్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు బుధవారం అందజేశారు. రామకృష్ణ అనారోగ్యానికి గురి కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.1,58,200 మంజూరైనట్లు ఎమ్మెల్యే రాజు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పత్తి రామారావు, విజయరామరాజుపేట పిఎసిఎస్ అధ్యక్షులు దొడ్డి కిషోర్, తుంపాల కన్నంనాయుడు, తుంపాల భాస్కర్రావు, పత్తి వెంకట్రావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని అడ్డురోడ్డు జంక్షన్‌లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర బుధవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలు గర్వించే వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రులు పేర్కొన్నారు. బహిరంగ సభలో ముందుగా మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేశారు. బహిరంగ సభలో మంత్రుల సమక్షంలో వైసీపీ నుండి యస్ రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి, మరికొంత మంది కార్యకర్తలు టిడిపి చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశారని, అప్పుడు పాలాభిషేకాలు చేసి, ఇప్పుడు వైసిపి నాయకులు ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గ ఇంఛార్జ్ గెడ్డం బుజ్జి, అమలకంటి అబద్ధం, బొలిశెట్టి గోవిందరావు, కందుల నాగేశ్వరావు, కొనతల శ్రీను, తుంపాలా నాగేశ్వరావు, గుర్రం నాగేశ్వరావు, నల్లపరాజు వెంకటపతి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ, వాడచీపురుపల్లి 33/11 కెవి ఉపకేంద్రాలలో నిర్వహణ పనుల కోసం గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల పరవాడ, తానాం, భరణికం, వెన్నెలపాలెం, ఈ.బోనంగి, గొర్లివానిపాలెం, పిఈర్.బోనంగి, కలపాక, రావాడ, దేశపాత్రునిపాలెం, జజ్జులవానిపాలెం, తిక్కవానిపాలెం, దలైపాలెం, వడచీపురుపల్లి, నాయుడుపాలెం, దోసూరు, ముత్యాలమ్మపాలెం, పూటగెడ్డపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి మెయింటినెన్స్ కారణంగా టి శిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి, నారాయణపాలెం, చిన్నివానిపాలెం, కాకరపల్లి ,మూలపేట, వెంకటాపురం గ్రామాలకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అచ్యుతాపురం : అనకాపల్లి -అచ్యుతాపురం రహదారి విస్తరణ పనులలో భాగంగా విద్యుత్ లైన్లు మార్పుకై గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 18 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటన తెలిపారు.

రేపు విద్యుత్ అంతరాయం

కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో నరసింగపల్లి ఫీడర్, తాళ్లపాలెం జి. భీమవరం ఎజిఎల్ ఫీడర్ పరిధిలో పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట ఈఈ రామకృష్ణ బుధవారం తెలిపారు. నరసింగపల్లి, జె.తుని, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్య పేట, ఉగ్గిన పాలెం, పరవాడపాలెం, జమాదుల పాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రీసర్వే షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లాలో రీసర్వే నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం రెవిన్యూ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పి.జి.ఆర్.ఎస్., రీసర్వే, ఎం.ఎల్.సి.సి., ఐవిఆర్ఎస్, నీటితీరువా, కోర్టుకేసులు, సివిల్ సప్లయి, స్మార్ట్ కార్డు పంపిణీ, ఆర్ఓఆర్ కోర్టు, దీపం-2 పథకం రీ పేమెంటు, ఓటరు మ్యాపింగు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మూడవ విడత రీసర్వేలో అనకాపల్లి డివిజనులో 15 గ్రామాలు, నర్సీపట్నం డివిజనులో 15 గ్రామాలలో అక్టోబరు 3వ తేదీనుండి రీ సర్వే చేపట్టడం జరిగిందని తెలిపారు. రీ సర్వే కార్యక్రమంలో 80 సర్వే బృందాలు పనిచేస్తున్నాయన్నారు. సర్వేలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పూర్తిచేయాలని సూచించారు. డివిజను, మండల స్థాయిలో నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ భూముల సర్వే చేయాలని, ఎక్కడైనా ఆక్రమణలను గుర్తించినట్లయిన ఆక్రమణదారులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. మండల స్థాయి సమన్వయ కమిటీకి సిఫార్సు చేసిన సివిల్ కేసులను శతశాతం పరిష్కరించుటకు కృషిచేయాలని కోరారు. నీటితీరువా వసూలు పెంచాలని, నిర్దేశించిన మొత్తాలను వసూలు చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖకు సంబంధించి రేషను షాపులు, బియ్యం బిల్లు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తహశీల్దార్లు, సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. దీపం పథకానికి సంబంధించి ఎవరికైనా రీపేమెంటులో సమస్య వచ్చినట్లయినా, వెంటనే పరిష్కరించి డబ్బులు వారి అక్కౌంటులో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, రెవిన్యూ డివిజనల్ అధికారులు వివిరమణ, షేక్ ఆయిషా, జిల్లా సప్లయి అధికారి మూర్తి, సర్వే సహాయ సంచాలకులు గోపాలరాజు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి జాహ్నవి

యూరియా కోసం షాపు వద్ద బారులు తీరిన రైతులు

ఎరువుల కోసం రైతుల అవస్థలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో రైతులు ఎరువుల కోసం బుధవారం తీవ్ర అవస్థలు పడ్డారు. కశింకోట జాతీయ రహదారి వద్ద ఉన్న ఎరువుల షాప్ వద్ద బుధవారం ఉదయం కొంతమంది రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. వెదురుపర్తి, బయ్యవరం, విస్సన్నపేట గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం అధిక సంఖ్యలో చేరుకోవడంతో షాప్ యజమాని సత్యనారాయణ స్వామి వారి రద్దీని చూసి షాప్ మూసివేశారు. పోలీస్ బందోబస్త్ లేకుండా మేము ఇవ్వలేమని ఆయన స్పష్టం చేశారు. మరో వైపు సకాలంలో ఎరువులు వెయ్యకపోతే పంట దిగుబడి రాదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రైతు సేవా కేంద్రంలో ఇవ్వకపోవడం వల్ల ఇక్కడ ఇబ్బంది పడుతున్నామని, సకాలంలో యూరియా ఇవ్వాలని రైతులు కోరారు.

ఆయుష్మాన్ వైద్యాలయం మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి రూ.53 లక్షలతో ఆయుష్మాన్ వైద్యాలయం మంజూరైనట్లు కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు కర్రి బాబి, గంగుపాము జగదీష్, బంటు రవి, ఆడారి గోవిందరావు మాస్టారు, పీలా సీతారాం, పీలా తాతు నాయుడు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

'హోంమంత్రి అనిత మహానటి'

ప్రజాశక్తి-యస్.రాయవరం : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మహానటి అని వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డులో వైసిపి కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అనిత ప్రతిపక్షంలో ఉంటే ఒకలా, అధికారంలో ఉంటే మరోలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే బల్క్ డ్రగ్స్ పార్క్ శంకుస్థాపన చేసారని అంటున్నారని, అసలు వర్చువల్‌గా శంఖుస్థాపన చేసిందని ఎన్‌డిఎ కూటమి ప్రధాని మంత్రి మోడీ కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిక్కల రామారావు, వీసం రామకృష్ణ, మధు వర్మ, నాయకులు పాల్గొన్నారు.

79వ వార్డులో కార్పొరేటర్ శ్రీనివాస్ పర్యటన

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం, బాలాజీ నగర్ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ని స్థానికులు కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తున్న లారీలపై కేసులు నమోదు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆనందపురం- అనకాపల్లి జాతీయ రహదారిలో పాలవలస నుండి సబ్బవరం హైవే రోడ్డు పనులకు ఓవర్ లోడ్‌తో వస్తున్న పై యాష్ లారీలను రోడ్డు రవాణా, విజిలెన్స్ అధికారులు దాడి చేసి కేసులు నమోదు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.వాసు తెలిపారు. ఒక్కో లారీలో 40 నుండి 50 టన్నులు పై యాష్‌తో ఓవర్ లోడ్ వేసినట్లు వారు గుర్తించినట్లు చెప్పారు. లారీ యజమానులు కోర్టులో జరిమానా చెల్లించి లారీలను విడుదల చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఎ.సంతోష్‌కుమార్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ఓల్డ్ ఆంధ్రాబ్యాంకు దగ్గర ఏబి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం జరిగింది. అత్యాధునిక ఎఐ ఆధారిత క్యాన్సర్ స్కానింగ్‌కు అధిక సంఖ్యలో బాధితులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి ప్రారంభించారు. వైద్య శిబిరంతో పాటో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ, ఆప్తమాలజీ, డెంటల్ తదితర 16 మంది వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ నాగ శ్రీనివాసరావు, టి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి బ్యాచ్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న భరణికం నివాసి పట్టా నర్సింగరావు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న నర్సింగరావు ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు నర్సింగరావు కుటుంబానికి రూ.38,000 ఆర్థిక సహాయం అందజేశారు.

జనవాణి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : జనవాణి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బుధవారం ప్రజల నుండి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. వర్షం వచ్చినా లబ్ధిదారులకు వినతులు ఇవ్వడానికి వచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు శ్రీను, ఊటకూటి రమేష్, గొర్లి బాబూరావు, వైస్ ఎంపీపీ రాజన శేషు, పిల్ల తులసీరామ్, కొటారు శ్రీను, నాగేశ్వరరావు, లవుడు లోవరాజు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
గురువారం 23 అక్టోబర్ 2025

రోడ్డు పనులను సత్వరమే చేపట్టాలి

ప్రజాశక్తి -రావికమతం: చినపాచిల నుండి టి. అర్జాపురం వరకు బి.యన్ రోడ్డు పనులను సత్వరమే చేపట్టాలనీ గిరిజనులు అర్ధనగ్నంతో బుధవారం డోలి యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, ఈ రోడ్డు పనులు చేపడితే చినపాచిల, ఎర్రబంద, కే. గదభపాలెం, కే.కొట్టాబిల్లి, పీ.కొత్తబిల్లి, రామన్న దొరపాలెం, డోలవానిపాలెం, టి.అర్జాపురం గిరిజన గ్రామాలకు ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. గతంలో పి.ఆర్ ప్రాజెక్టు ద్వారా 14 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి 6 కోట్ల 98 లక్ష రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను జనవరి 2024లో మొదలుపెట్టడం జరిగిందన్నారు. ఆరు కిలోమీటర్ల వరకు జిఎస్బి గ్రావెల్ పిక్క వేసి రోలింగ్ చేశారని,

-గిరిజనుల డోలీయాత్ర

పి.కోట్నాబెల్లి నుండి రామన్న దొరపాలెం వరకు రోడ్డును తవ్వేసి వదిలేసారన్నారు. బిల్లులు ఇవ్వక పోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడం జరిగిందన్నారు. రోడ్డు పూర్తిగా గుంతలు, గుంతలుగా ఏర్పడిందన్నారు. దీంతో ఆదివాసి గిరిజనులు సచివాలయాలకు రావాలంటే 15 కిలోమీటర్ల నడిచి రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనికి నిరసనగా పాత కొత్తబిల్లి నుంచి మోదకొండమ్మ గుడి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర గిరిజనులు అర్ధనగ్నంగా డోలి యాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డోలితో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, ఎస్.వలసయ్య తదితరులు పాల్గొన్నారు.

డోలీ యాత్ర చేపడుతున్న గిరిజనులు

రోలింగ్ చేస్తున్న కూలీలు

వంతెన వద్ద గండి పూడ్చివేత

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలోని కెజెపురం గ్రామ సమీపంలో వంతెన వద్ద ఇటీవల ఏర్పడ్డ గండిని ఆర్అండ్బీ అధికారుల సహకారంతో తెలుగుదేశం పార్టీ నాయకులు చర్యలు చేపట్టారు. ఆ గండిని సిమెంట్ గోట్టాలు వేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాపేటి జోగునాయుడు, ఎర్రం దేవి, చైర్మన్ ఆడారి బాజ్జీ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అరకులోయ మండల కేంద్రంలోని బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్, అరకు ఇంచార్జీ సియ్యారి దొన్ను దొర మద్యం దుకాణాలను పరిశీలించారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం తీసుకోవాలని సూచనలు చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా నకిలీ మందా మంచిమందా నిర్ధారించబడుతుందని తెలిపారు. గతంలో వైసిపి పాలనలో కల్తీ మద్యం తాగి చాలామంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

ఒకే భవనంలో రెండు సచివాలయ కేంద్రాలు

అద్దె భవనాల్లో సచివాలయాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం:స్థానిక పరిపాలన బలోపేతంగా ఉండేందుకు ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న సచివాలయాలకు శాశ్వత భవనాలు లేక పోవడంతో అద్దె కొంపన నడవాల్సిన పరిస్థితి నెలకొంది. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 28 గ్రామ వార్డులకు గాను 17 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులో కేవలం 10 భవనాలు మాత్రమే అద్దె లేకుండా నిర్వహిస్తూ ఉండగా 7 సచివాలయ భవనాలు మాత్రం అద్దె కొంపన నడుస్తూ ఉన్నాయి. శారద నగర్(1)(2) కొత్త వీధి, రామారావు పేట, పెదబొడ్డేపల్లి (6)(8) కలిసి మొత్తం 7 సచివాలయాలు అద్దె కొంపన నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రాకముందు శారద నగర్‌లో రెండు సచివాలయాలు వేరువేరుగా నడిచేవి. ప్రస్తుతం రెండు ఒకే భవనంలోకి చేర్చారు. సచివాలయాల పాలన స్థిరత్వం లేక పోవడంతో అద్దె కొంపలో నడుస్తుంది సచివాలయాలలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, నీటి, ఇంటర్నెట్ సౌకర్యం కూడా సక్రమంగా లేక కొన్ని సచివాలయాలు సిబ్బంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సురేంద్రను వివరణ కోరగా నిధుల కొరతతో పాటు భూముల లభ్యత లేక పోవడంతో భవనాలు ఏర్పాటు కష్టతరంగా ఉంది. పరిష్కార మార్గం కోసం ఉన్నత స్థాయి అధికారులకు ప్రభుత్వానికి తెలియజేసినట్లు తెలిపారు,

పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలో బుధవారం కాగిత, గుల్లిపాడు, సిహెచ్ బి అగ్రహారం గ్రామాల్లో వరి పొలాలను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పరిశీలించారు. వరిలో ఆకుముడత, నాము, తెల్ల తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అందరూ వ్యవసాయ పథకాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో దగ్గరలో ఉన్న ఆర్ఎస్‌కె సిబ్బందితో నమోదు చేయించుకోవాన్నారు. 22వ విడత పిఎం కిసాన్ లబ్ది పొందాలంటే తప్పని సరిగా నమోదు కావాలన్నారు. ఆర్ఎస్‌కె సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఈ పంట, ఫార్మర్ రిజిస్ట్రీ, యూరియా సరఫరా పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓలు సత్యనారాయణ, శ్రీనివాస్, సాయి కుమారి, వ్యవసాయ సహాయకులు ధనరాజు, ఆర్ ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

మత్స్యకార సొసైటీ అధ్యక్షులుగా గోపి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో ఉద్దండపురం మత్స్యకార సొసైటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా సొసైటీ అధ్యక్షులుగా ధోని గోపి, సభ్యులు ఎన్నికయ్యారు. బుధవారం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి నాగమణి ఎన్నికల అధికారిగా వ్యవహరించి, ఎన్నిక నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులుగా ధోని గోపి, ఉపాధ్యక్షులుగా దొంగల అప్పలరాజు, సభ్యులుగా మల్లె మసేను, కే.సత్తిబాబు, ఆర్.అచ్చారావు, ఏ శ్రీను, డి.నూకతాతలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో, వారికి నియామక పత్రాన్ని అందజేశారు.

మాట్లాడుతున్న వీరసూర్యచంద్ర

'కందుకూరు ఘటనపై రాజకీయాలు తగదు'

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్ :కందుకూరు ఘటనపై వైసీపీ శవ, కుల రాజకీయాలు చేస్తుందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కందుకూరులో జరిగిన ఘటనను బూచిగా చూపించి ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ను ఏ1గా చేర్చాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఏ2గా, మంత్రి నారా లోకేష్ ను ఏ3గా చేర్చాలని వైసీపీ నాయకుడు జక్కంపూడి రాజా అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శవరాజకీయాలతో వైసీపీ పార్టీ పుట్టిందని ఎద్దేవా చేశారు. అటువంటి పార్టీ చెప్పే మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, చోద్యం పిఏసిఎస్ డైరెక్టర్ రేగుబళ్ల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు

ఆనందపురంలో జంపింగ్ చేస్తున్న క్రీడాకారుడు

ప్రజాశక్తి-ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆనందపురంలో డివిజనల్ స్థాయి క్రీడల పోటీలు బుధవారం జరిగాయి. డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సాహపరిచారు. అండర్ 17 కబడ్డీ పోటీల్లో ఆనందపురం జట్టు, అండర్ 14 కబడ్డీలో చినగదిలి జట్టు, అండర్ 14, 17 రెండు విభాగాల్లో ఖోఖోలో చినగదిలి జట్టు, అండర్ 17 వాలీబాల్ పోటీల్లో ఆనందపురం జట్టు విజేతలుగా నిలిచాయి. వీటితోపాటు చెస్, షటిల్, అథ్లెటిక్స్, యోగా పోటీలలో విజేతలకు ఆనందపురం పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు, కెనరా బ్యాంక్ మేనేజర్ ఆర్.శంకర్ నారాయణ, కొట్యాడ్ సత్యమూర్తి, జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్పా రాజశేఖర్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. డివిజనల్ కోఆర్డినేటర్ రవి, పిఇటిలు లలిత్ కుమార్, నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు భీమిలి విద్యార్థులు

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆనందపురం జెడిపి హైస్కూల్‌లో నిర్వహించిన విశాఖ రెవెన్యూ డివిజన్ స్థాయి అండర్ 14 బ్యాడ్మింటన్ పోటీల్లో భీమిలి విద్యార్థులు ప్రతిభ సత్తాచాటారు. రెండు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బి నితిన్, కె స్నేహిత్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ నెల 29, 30 తేదీల్లో అనకాపల్లిలో జరుగు జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు.

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇప్పటికే ఈ పాఠశాల కు చెందిన పలువురు విద్యార్థునులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కాగా నర్సీపట్నం గురుకుల (పెద్ద బొడ్డేపల్లి) పాఠశాల లో బుధవారం జరిగిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన మరో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ - 14 కబడ్డీ విభాగం లో గోరింట మహేంద్ర, అండర్-17 వాలీబాల్ విభాగంలో కిముడు శివ కుమార్ ఎంపికయ్యారు. కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులను క్రీడల కోఆర్డినేటర్ వెంకట రమణ పాఠశాల హెచ్ఎం రాజకుమార్ వ్యాయామ ఉపాధ్యాయులు వి. ఆనంద్ అభినందించారు.

గెలుపొందిన విద్యార్థులు

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో తట్టబంద సచివాలయాన్ని రావికమతం ఎంపీడీవో మహేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పలు శాఖల వారీగా ఒక్కొక్కరి పనితీరు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మహేష్ మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది అందరూ గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. డ్రైనేజీలను స్థానిక సర్పంచి గోకివాడ రమణ తో కలిసి పరిశీలించారు.సచివాలయ సిబ్బంది సమయానికి హాజరు కాకపోయినా, పనులపై నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ గోకివాడ రమణ మాట్లాడుతూ, పంచాయతీ శివారు కసిడిపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కసిరెడ్డిపాలెం, బూరుగుపాలెం గ్రామాల్లో అంగనవాడి భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిపివేశారన్నారు.తక్షణమే పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కట్ట శ్రీను, మండలం తెలుగుదేశం పార్టీ కోశాధికారి శివాజీ, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు సొంత నిధులతో పాఠశాలలో ఆహ్లాకరంగా ఉండే విధంగా మొక్కలను నాటారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు కనకరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మింది కొండాజీ, గాడి కిషోర్ నెయిదొండ గోపాల్, సీతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23న ఏఎల్.పురం, 24న కృష్ణదేవిపేట, 25న చోద్యం, 27న కొత్తమల్లంపేట, 28న జోగంపేట, 29న చీడిగుమ్మల, 30న కొత్తఎల్లవరం ఎంపీపీ పాఠశాలలో ఈ క్యాంపులు జరుగుతాయన్నారు. ఆధార్ అప్‌డేట్, కొత్త ఆధార్ కార్డుల కోసం ఈ క్యాంపులు వినియోగించు కోవాలన్నారు.

రోలుగుంట:ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు జిల్లా పరిషత్ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. మండలంలో మూడు గ్రూపులుగా ఏర్పాటు చేసి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ప్రజాభీష్టం మేరకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

-వైసిపి మాజీ మంత్రులు- కొనసాగిన మత్స్యకారుల రిలే దీక్షలు

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులు తలపెట్టిన బల్క్ డ్రగ్ ఉద్యమానికి అండగా నిలుస్తామని వైసిపి శ్రేణులు మత్స్యకారులకు హామీ ఇచ్చారు. మండలంలో రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు సంఘీభావం తెలిపేందుకు బుధవారం వైసిపి శ్రేణులు ఛలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, పలువురు మాజీ శాసనసభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు తరలివచ్చి మత్స్యకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.పరవాడ ఎస్ఇ జెడ్, రామ్ కీ ఫార్మా, భోగాపురం ప్రాంతాల్లో ప్రజలను ఒప్పించి భూసేకరణ, పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీసులు అనేక ఆంక్షలు పెడుతున్నారని సంఘ విద్రోహశక్తులుమా అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాకవరపాలెం పర్యటనకు వచ్చినప్పుడు, మత్స్యకారులంతా ఆయన్ను కలవడంతో, తామందర్నీ వెళ్లి మత్స్యకారుల ఆందోళనకు సంఘీభావం తెలపాలని ఆదేశించడంతో తాము వచ్చినట్లు తెలిపారు. ముందుగా జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకారులు ఎరిపిల్లి నాగేష్, పైడితల్లి, రాజేశ్వరి మాట్లాడారు. ఇప్పటికే కాలుష్యం కారణంగా సముద్రంలో మత్స్య సంపద నశించి పోయిందని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు నాశనం అవుతాయన్నారు. హెూం మంత్రి అనితకు రెండువేల ఓట్ల మెజారిటీని గ్రామం నుండి ఇచ్చామని, అయినప్పటికీ నమ్మించి మోసం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, కన్నబాబు, హైమావతి, చెంగల వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నాయకులు చిక్కాల రామారావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు

వైసిపి ఛలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్టడంతో పోలీసు బలగాలను మొహరించారు. నక్కపల్లి నుండి రాజయ్యపేట వరకు పలు జంక్షన్ల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వైసిపి తలపెట్టిన ఛలో రాజయ్యపేటకు 48 మంది వైసీపీ శ్రేణులకు పోలీసుల అనుమతినిచ్చారు. అడిషనల్ ఎస్పీ దేవ ప్రసాద్, నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు, అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి, నక్కపల్లి సిఐ మురళి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొనసాగిన రిలే దీక్షలు

బల్క్ డ్రగ్ నిలుపుదల చేసే వరకు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడుతామని మత్స్యకారులు స్పష్టం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు బుధవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ వ్యతిరేకిస్తూ మత్స్యకారులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. ఇప్పటికే సముద్రం వ్యర్థ రసాయన జలాలతో కలుషితమవడంతో మత్స్య సంపద నశించిపోయి ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వెలబుచ్చారు. తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో సిహెచ్ లక్ష్మీపురంలో బుధవారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ విధానాన్ని పర్యవేక్షించారు. ప్రతిరోజు తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి నియోజకవర్గానికీ ఇసుక స్టాక్ పాయింట్

- మద్యం దుకాణాల్లో సురక్ష యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో హోంమంత్రి అనిత తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : సామాన్య ప్రజలకు జిల్లాలో ఇసుక కొరత లేకుండా ఉండేందుకు ప్రతి నియోజకవర్గానికి ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర భూగర్భ గనుల, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం గనులు భూగర్భ, ఎక్సైజ్ శాఖల పురోగతిపై రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, మాడుగుల, పెందుర్తి, చోడవరం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, కెఎస్ఎన్ఎస్.రాజుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఇసుక అవసరమైతే మరికొన్ని స్టాక్ పాయింట్లు ఏర్పాటు చెయ్యాలని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం శ్రీనివాస్‌ను ఆదేశించారు. 1 నుండి 3 వరకు గల ఇసుక రీచ్‌లలో ఎడ్ల బండి, ట్రాక్టర్ల సహాయంతో వారి సొంత అవసరలకు ఇసుకను తరలించుకోవచ్చని తెలిపారు. ఎక్సైజ్ శాఖపై ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే మద్యం దుకాణాల్లో అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. మద్యం సీసాపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకొని మద్యం సీసా అసలుదో, నకిలీదో నిర్ధారించుకొని మద్యాన్ని కొనుగోలు చేసుకోవాలని మద్యం వినియోగదారులకు మంత్రి సూచించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, డిఆర్వో వై.సత్యనారాయణ రావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వివి రమణ, జిల్లా ఎక్సైజ్ అధికారి వి సుధీర్, జిల్లా భూగర్భ గనులు శాఖ అధికారి ఎం శ్రీనివాస్, నీటి పారుదల శాఖ డిఈఈ త్రినాథ్. వివిధ రాష్ట్ర కార్పొరేషన్‌ల చైర్మెన్లు పీలా గోవింద సత్యన్నారాయణ, మళ్ళ సురేంద్ర బాబు, బత్తుల తాతయ్య బాబు, కె విజయ్ కుమార్, డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, అధికారులు పాల్గొన్నారు.

కుంగిన బ్రిడ్జిని పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎస్.ఆనందపురం -కొత్తవలస రోడ్డులో కృష్ణరాయుపేట వద్ద రైవాడ నీటి కాలువపై బ్రిడ్జి కుంగిపోయిందని, దానిని వెంటనే పునర్నిర్మించాలని సిపిఎం నాయకులు గండి నాయినబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ బ్రిడ్జి కుంగిపోవడంతో నాలుగైదు నెలలుగా దేవరాపల్లి వెళ్లే బస్సులు ఈ బ్రిడ్జి వరకే నడుస్తున్నాయని, దీంతో బస్సుల సంఖ్యలో తగ్గించివేశారని, ఈ కారణంగా ఈ మార్గంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే మండలంలోని సింగన్నదొరపాలెం ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఆ గోతును పూడ్చాలని కోరారు. జిల్లాలో కాంట్రాక్టర్లకు సుమారు 140 కోట్లు ప్రభుత్వం బకాయి చెల్లించవలసి ఉందని, దీంతో వారు ఏ చిన్న పనికైనా ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : 1990 పోలీస్ బ్యాచ్ శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఇటీవల మృతి చెందిన అసోసియేషన్ సభ్యుడు వి.అప్పలరాజు కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల తమ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన నిధి నుంచి ఆసుపత్రిలో ఎవరైనా తమ సభ్యులు జాయిన్ అయితే వారికి పదివేల నుంచి 20వేల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్, వైస్ ప్రెసిడెంట్ టి.ఎం నాయుడు, సెక్రటరీ సాయిబాబా రాజు, కోశాధికారి వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు మిలటరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.